క్లుప్తంగా

నేడు సమావేశం

బ్రహ్మంగారిమఠం : శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు ఈ నెల 27 నుంచి మే 2 వరకు జరగనున్న సందర్భంగా గురువారం ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో అధికారుల సమావేశం ఉంటుందని ఎంపీడీఓ వెంగమునిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఆర్డీఓ, ఎంపీపీ, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీలు, వీరబ్రహ్మేంద్రస్వామిమఠం, ఈశ్వరీదేవిమఠం, నిత్యాన్నదానాల సత్రాల నిర్వాహకు లు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

రంజాన్ తోఫా పంపిణీ


రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న షబ్బీర్ హుసేన్

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మహమ్మదీయ కాలనీకి చెందిన స్వర్ణకారుడు షేక్ షబ్బీర్ హుసేన్, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం 70 మంది దివ్యాంగులతో పాటు మొత్తం 600 మంది పేదలకు కులమతాలకతీతంగా రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఏడేళ్లుగా ప్రతి ఏడాది రంజాన్ పర్వదిన సందర్భంగా తాను సంపాదించిన దానిలో కొంత మొత్తంతో రంజాన్ తోఫాను అందరికీ అందిస్తున్నామని ఆయన తెలిపారు. షాహుల్ యస్దాన్, సమద్ హుసేన్, సల్మాన్, జీసీ పుల్లయ్య, రమణాచారి, జమాల్‌వలి పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో ఇఫ్తార్

స్థానిక ఆర్ట్స్‌కాలేజీ రోడ్డులో బుధవారం సాయంత్రం 33, 34 వార్డు ప్రజలకు టీడీపీ నాయకుడు సీఎం సురేష్ నాయుడు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 33వ వార్డు కౌన్సిలర్ గాజుల శివజ్యోతి, 34వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి నీలాపురం బాషా, టీడీపీ పట్టణాధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి, టీడీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

చాపాడు : మండల పరిధి చియ్యపాడు పంచాయతీలోని గుంతచీపాడు గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ గ్రామంలో ప్రజలందరికీ వైద్యురాలు శ్రీవాణి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేసి, వారికి అవసరమైన మందులను పంపిణీ చేస్తామన్నారు. ఆయా గ్రామాల్లోని ప్రజలందరూ వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పీహెచ్‌సీ తనిఖీ


రికార్డ్స్ పరిశీలిస్తున్న స్పెషలాఫీసర్ చంద్రశేఖర్

పోరుమామిళ్ల : టేకూరుపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని బుధవారం మండల ప్రత్యేకాధికారి చంద్రశేఖర్ ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలు, మందుల పంపిణీ తదితర విషయాలను ఆరా తీశారు. కార్యక్రమంలో వైద్యులు, ఆరోగ్యవిద్యాధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. పోరుమామిళ్ల 30 పడకల ఆసుపత్రిలో స్టాఫ్‌నర్సులు, వైద్యుల మధ్య ఇటీవల కొంతకాలంగా ఏర్పడిన విభేదాల నేపథ్యంలో బుధవారం వైద్యబృందం విచారణ జరిపింది. ప్రొద్దుటూరు నుంచి డాక్టర్ ఆనంద్‌బాబు, రేడియాలజిస్ట్, బద్వేలు నుంచి డాక్టర్ శ్రీవాణిలు విచారించారు.

గాంధీ విగ్రహానికి పూలమాల వేసిన చంద్రబాబు

పోరుమామిళ్ల : బద్వేలు నుంచి గిద్దలూరు వెళుతున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం సాయంత్రం పోరుమామిళ్లలో గాంధీ విగ్రహం వద్ద కొద్దిసేపు ఆగి మహాత్ముని విగ్రహానికి పూలమాల వేశారు.

డీఈఓకు అభినందన

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో పదో తరగతి పరీక్షలను ఎక్కడ ఎలాంటి ఆరోపణలకు తావు లేకుండా నిర్వహించడంతోపాటు మూల్యాంకన కేంద్రంలో ఉపాధ్యాయులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించారని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు డీఈఓను అభినందించారు. ఈ మేరకు బుధవారం కడప మూల్యాంకన కేంద్రం క్యాంపు కార్యాలయంలో డీఈఓను సత్కరించారు. రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ మురళి, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

శిల్పారామ కల్యాణ మండపం లీజుకు ఆహ్వానం

పులివెందుల : పట్టణంలోని ఉలిమెల్ల రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న శిల్పారామం కల్యాణ మండపంను లీజుకు తీసుకునేందుకు ఆసక్తిగల వారు శిల్పారామ సీఈఓను కానీ, పాడా ఓఎస్డీ కార్యాలయంలో కానీ సంప్రదించాలని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. రింగ్ రోడ్డు సమీపంలో 10.50ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన శిల్పారామ కల్యాణ మండపాన్ని ఆధునీకరించామన్నారు. వివరాలకు 9959275479, 9849900961 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

రబీ సాగు.. దిగుబడి బాగు


మైదుకూరు వద్ద కేసీ ప్రధాన కాలువలో సాగునీరు


దువ్వూరు మండలంలో సాగు చేసిన వరి పైరు

- మైదుకూరు డివిజన్‌లో 2115 హెక్టార్లలో
- పంటదశలో వరి పైర్లు
- పలు చోట్ల మొదలైన నూర్పిళ్లు

చాపాడు : మైదుకూరు డివిజన్ పరిధిలో కేసీ కెనాల్ సాగునీటి ఆధారం ద్వారా 2022–23 రబీ సీజన్‌లో 2115.7 హెక్టార్లలో రైతులు వరి సాగు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఏప్రిల్ మాసంలో సైతం కేసీ కెనాల్ సాగునీరు రావటం, ముందస్తుగానే రబీ పంటలకు సాగునీరు వస్తుందని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, అధికారులు ప్రకటనలు చేయటంతో రైతులు ఆసక్తిగా వరి సాగుపై దృష్టి సారించారు. ఖరీఫ్ సీజన్‌లో వరి దిగుబడులు రైతులు ఊహించని విధంగా ఎకరాకు 48 బస్తాల వరకూ దిగుబడులు వచ్చాయి. దీంతో రెండో కారుపై రైతులు దృష్టి సారించారు. ప్రస్తుతం మైదుకూరు డివిజన్ పరిధిలో వరి పైర్లు పంటదశలో ఉండగా.. పలు చోట్ల ముందుగా సాగైన చోట్ల వరి నూర్పిళ్లు జరుగుతున్నాయి. ఎకరాకు 32–48 బస్తాల వరకూ దిగుబడులు వస్తున్నట్లు రైతులతోపాటు అధికారులు గణాంకాలు తెలియజేస్తున్నాయి. డివిజన్‌లో అధికంగా చాపాడు మండలంలో 1306 హెక్టార్లలో వరి సాగైంది. అత్యల్పంగా రాజుపాళెం మండలంలో 68.7 హెక్టార్లలో వరి సాగు చేశారు. ఖరీఫ్‌తోపాటు రబీలో సైతం రైతులకు వరి పంట ద్వారా అధిక దిగుబడులు వచ్చాయని వ్యవసాయ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణమూర్తి తెలిపారు.

మైదుకూరు డివిజన్‌లో రబీలో వరి సాగు వివరాలు (హెక్టార్లలో)..

మండలం	సాగు అంచనా	సాగైన వరి
రాజుపాళెం	250	68.7
దువ్వూరు	7211	557
మైదుకూరు	397	184
చాపాడు	936	1306
మొత్తం	2304	2115.7

నిబంధనలు పాటించకుంటే అనుమతులు ఇవ్వొద్దు


సమావేశంలో మాట్లాడుతున్న అనుడా వైస్ చైర్మన్ ఓబులేసు నందన్

ప్రొద్దుటూరు : ప్రభుత్వ నిబంధనలను పాటించకపోతే బిల్డింగ్ అప్రూవల్‌కు అనుమతులు ఇవ్వొద్దని అనుడా వైస్ చైర్మన్ ఓబులేసు నందన్ అధికారులను ఆదేశించారు. మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం మండల పరిధిలోని గ్రామ కార్యదర్శులు, ప్లానర్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటు వెంచర్ల యజమానులు 30 అడుగుల విస్తీర్ణంలో రోడ్డును వదిలి గిఫ్ట్ డీడ్ కింద గ్రామ పంచాయతీకి రాయించాలని, అప్పుడే బిల్డింగ్ నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఇప్పటికే ప్లాట్లు కొన్న యజమానులకు సైతం ఈ నిబంధనలు అమలు చేయాలని సూచించారు. ప్లాన్ అప్రూవల్ లేకుండా రోడ్లు వేయొద్దని, విద్యుత్ సరఫరా ఇవ్వొద్దని తెలిపారు. ప్రతి వెంచర్‌కు సంబంధించి కమ్యూనిటీ నిర్మాణాల కోసం 10 శాతం స్థలాన్ని గ్రామ పంచాయతీకి రాయించాలని, ఒక వేళ ఇప్పటికే స్థలాలు అమ్మి ఉంటే అందుకు సరిపడా డబ్బును గ్రామ పంచాయతీ వసూలు చేయాలన్నారు. కేవలం ఆన్‌లైన్ ద్వారా మాత్రమే పారదర్శకంగా ప్లాన్, బిల్డింగ్ అప్రూవల్స్ మంజూరు చేయాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే అధికారుల ఉద్యోగాలు పోతాయని, ఇందుకు సంబంధించి వారే సంజాయిషీ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. 300 చదరపు మీటర్ల విస్తీర్ణం వరకు గ్రామ పంచాయతీ పరిధిలో ఉంటుందని, ఆపైన విస్తీర్ణం ఉంటే అనుడాకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సమావేశం అనంతరం కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మాట్లాడుతూ అమృతానగర్ రోడ్డులోని కేవీఆర్ కాలనీకి అనుమతులు ఇవ్వకున్నా నిర్మాణాలు చేపడుతున్నారని ఫిర్యాదు చేయడంతో అధికారులు సంఘటన స్థలానికి వెళ్లారు. అనుమతులు ఇవ్వకుండా ఎలా విద్యుత్ సరఫరా చేస్తున్నారని ఏఈ నరసింహారెడ్డిని ఫోన్‌లో ఓబులేసు నందన్ అడిగారు. పంచాయతీ రోడ్డును ఆక్రమించి ఇల్లు నిర్మిస్తున్నారని సర్పంచ్ ఫిర్యాదు చేశారు. హాపీ హోమ్స్‌పై గ్రామ పంచాయతీ కార్యదర్శి గురుమోహన్ ఫిర్యాదు చేశారు. సమావేశంలో డీటీసీపీ కృష్ణసింగ్, గోపవరం ఉపసర్పంచ్ రాఘవరెడ్డి, ప్లానర్స్ తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలుపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారు


టీ.సంద్రపల్లెలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

గోపవరం : మండలంలోని టీ.సంద్రపల్లె సచివాలయం పరిధిలోని టీ.సంద్రపల్లె, ఎస్సీకాలనీ, పోలిరెడ్డిపేట, గ్రామాల్లో బుధవారం జరిగి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. లబ్ధిదారులు కూడా ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఎమ్మెల్యే ఎదుట సంతృప్తిని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మరో ఏడాది పాలనలో మరింత లబ్ధి చేకూరుతుందని, సమస్యలు తెలుసుకునేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో మీ వద్దకు వచ్చామని తెలిపారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశామని తల్లిదండ్రులు కూడా వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ముందుకు వస్తున్నారన్నారు. ఎంత ఖర్చు అయినా తానే భరిస్తానని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తల్లిదండ్రులకు భరోసా కల్పిస్తుంటే ప్రతిపక్షం ప్రభుత్వంపై ఏదో ఒక సాకు చూపి బురదజల్లే పనిగా పెట్టుకున్నట్లు ఆమె తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి త్వరలో జరగబోయే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, ఇందుకు ప్రజలంతా సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరినారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోపవరం మల్లికార్జునరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్ సరిత, పార్టీ నాయకులు భాస్కర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమృత్ నీటి పథకం ట్రయల్‌రన్ ప్రారంభం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు రూ.150 కోట్లతో నిర్మించిన అమృత్ తాగునీటి పథకానికి సంబంధించి ట్రయల్‌రన్ ప్రారంభమైనట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మైలవరం డ్యాం నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ప్రొద్దుటూరుకు తాగునీటి పైపులైన్ నిర్మించారన్నారు. పైపులైన్‌తోపాటు బైపాస్ రోడ్డులోని రెండు కొళాయిల వద్ద వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, ఎత్తైన ఓవర్ హెడ్ ట్యాంక్‌ను నిర్మించారన్నారు. భారీ తాగునీటి పథకం కావడంతో బుధవారం ప్రారంభమైన ట్రయల్ రన్ కొద్ది రోజులపాటు జరుగుతుందన్నారు. మార్గం మధ్యలో పైపులైన్ సాంకేతిక సమస్యలు, మోటార్, పంపు సమస్యలను పరిశీలించిన అనంతరం మే నెలలో పథకాన్ని అధికారికంగా ప్రారంభిస్తారని తెలిపారు. శ్రీశైలం జలాశయం నుంచి మైలవరానికి, మైలవరం నుంచి పైపులైన్ ద్వారా ప్రొద్దుటూరుకు తాగునీరు సరఫరా చేస్తారని చెప్పారు. రెండు కొళాయిల వద్ద నుంచి పట్టణంలో కొత్తగా నిర్మించిన మూడు ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా ప్రజలకు నీటిని సరఫరా చేస్తామని వివరించారు. గత ఎన్నికల్లో తాగునీటి సమస్యను పరిష్కరించని పక్షంలో 2024 ఎన్నికల్లో పోటీ చేయబోనని ఇచ్చిన హామీ మేరకు తాగునీటి సమస్య త్వరలో పరిష్కారం అవుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక సకాలంలో వర్షాలు పడుతుండటంతో చాలా వరకు నీటి సమస్య పరిష్కారమైందన్నారు. అమృత్ పథకం ప్రారంభిస్తే ప్రజలకు పగటి పూటే నీరు సరఫరా చేస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, ప్రజారోగ్య శాఖ ఈఈ చెన్నకేశవరెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ సాయికృష్ణ, డీఈ దస్తగిరి, ఏఈ దస్తగిరిరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరాపై ఎమ్మెల్యే సమీక్ష

మూడో విడత వైఎస్సార్ ఆసరా పథకంపై ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదురుగా ఉన్న సచివాలయంలో బుధవారం మెప్మా, సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. పట్టణంలోని 14 గ్రూపులకు రూ.18.60 లక్షలు వైఎస్సార్ ఆసరా డబ్బు రావాల్సి ఉందని.. వారి అకౌంట్లలో పడలేదని ఎమ్మెల్యే ప్రశ్నించారు. సాంకేతిక కారణాల వల్ల ఈ సమస్య తలెత్తిందని.. వీలైనంత త్వరలో సమస్యను పరిష్కరించి మహిళల ఖాతాలో డబ్బు జమ చేస్తామని అధికారులు సమాధానమిచ్చారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, ఎంపీపీ శేఖర్ యాదవ్, రాజుపాళెం ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి, మెప్మా టీఈ కెజియా జాస్లిన్, వార్డు కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకులు సరఫరా చేయాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ నజీర్ అహ్మద్

ప్రొద్దుటూరు : ఎండీయూ(మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్)లు తమకు కేటాయించిన అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం, కందిపప్పు, పామాయిల్ సరఫరా చేయాలని తహసీల్దార్ నజీర్ అహ్మద్ తెలిపారు. మండల రెవెన్యూ కార్యాలయ ఆవరణలో బుధవారం ఎండీయూలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎండీయూల వారీగా అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకులు సరఫరా చేస్తున్నారా లేదా అని వివరాలను అడిగి తెలుసుకున్నారు. చాలా మంది పంపిణీ చేయడం లేదని తెలపడంతో తహసీల్దార్ ప్రశ్నించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నిర్దేశించిన అంగన్‌వాడీ కేంద్రాలకు ఎండీయూలు తప్పనిసరిగా సరుకులు సరఫరా చేయాలని, ఇందుకు సంబంధించి ఎండీయూలకు ప్రభుత్వం డబ్బు చెల్లిస్తోందన్నారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రసాద్, అర్బన్ సీడీపీఓ హైమావతి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పాపనపల్లెలో పశువైద్య శిబిరం

బి.కోడూరు : జిల్లా పశుసంవర్ధకశాఖ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ వారి ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని పెద్దుళ్లపల్లె వాటర్ షెడ్ ప్రాజెక్టు పరిధిలోని పాపనపల్లె గ్రామంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ భరద్వాజకృష్ణ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 35 దూడలు, పశువులకు, 700 గొర్రెలు, మేకలకు వైద్యం అందించారు. అనంతరం పాడిరైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో వాటర్‌షెడ్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, వాటర్‌షెడ్ టెక్నికల్ ఆఫీసర్ వెంకటరమణ, పశు సహాయకులు సిద్దయ్య, నందిని, రాజశేఖర్, వాటర్‌షెడ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

కాశినాయన : మండలంలోని చిన్నాయపల్లె గ్రామంలో బుధవారం నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 95 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రక్తహీనత ఉన్న వారికి క్యాల్షియం, ఐరన్ సిరప్‌లు పంపిణీ చేశారు. బీపీ, షుగర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో స్థానిక ఏఎన్‌ఎం వరమ్మ, వైద్య సిబ్బంది, ఆశావర్కర్ పాల్గొన్నారు.

కొర్రపాడులో మా నమ్మకం నువ్వే జగనన్నా


'జగనన్నే మా భవిష్యత్' లో సూర్యనారాయణరెడ్డి

రాజుపాళెం : మండలంలోని కొర్రపాడు గ్రామంలో బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు దొంతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి నిర్వహించిన 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఇళ్ల వద్దకు వెళుతున్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో 'మా నమ్మకం నువ్వే జగన్' అంటూ ప్రజలు నినదిస్తున్నారు. అలాగే సర్వే నిర్వహించారు. గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఉన్న తేడాను వివరించి, వారి మొబైల్స్‌కు, ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు.

చిన్నపాటి జాగ్రత్తలతో అగ్నిప్రమాదాల నివారణ


పెట్రోల్ బంకులో పని చేస్తున్న సిబ్బందికి సూచనలు ఇస్తున్న అగ్నిమాపక అధికారి రఘునాథ్

ప్రొద్దుటూరు క్రైం : చిన్నపాటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల అగ్నిప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని సహాయ అగ్నిమాపక అధికారి రఘునాథ్ తెలిపారు. గాంధీరోడ్డులోని రోటరీకంటి వైద్యశాలలో బుధవారం అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోర్టబుల్ అగ్నిమాపక పరికరాల గురించి అధికారులు వివరించారు. అగ్నిప్రమాదంలో చిక్కుకున్న వారు భయపడకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ప్రాణాలతో సురక్షితంగా బయటపడొచ్చని తెలిపారు. హాస్పిటల్ పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తర్వాత పోలీసు వెల్ఫేర్ పెట్రోల్ బంకులో పని చేస్తున్న సిబ్బందికి పోర్టబుల్ అగ్నిమాపక పరికరాలను ఉపయోగించే విధానం గురించి వివరించారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

పోరుమామిళ్ల : అగ్నిమాపక వారోత్సవాల్లో 6వ రోజు బుధవారం పోరుమామిళ్ల అగ్నిమాపక సిబ్బంది ఆసుపత్రిలో సిబ్బందికి, వైద్యులకు అవగాహన కల్పించారు. అగ్ని మాపక అధికారి వసంతనాయక్ ఆధ్వర్యంలో స్థానిక ఓయల్‌ఎఫ్ ఆసుపత్రిలో అగ్నిప్రమాదం తలెత్తినపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు.

పేద కుటుంబానికి సీఐ చేయూత


సరుకులు, దుస్తులను అందచేస్తున్న టూ టౌన్ సీఐ ఇబ్రహీం

ప్రొద్దుటూరు క్రైం : నిరుపేద కుటుంబంలో రంజాన్ పండుగ సంతోషాలను నింపారు ప్రొద్దుటూరు టూ టౌన్ సీఐ ఇబ్రహీం. వివేకానంద కాలనీకి చెందిన షబానాకు ఇద్దరు కుమార్తెలు. ఆమె భర్త కొన్నేళ్ల క్రితం చనిపోయారు. దీంతో ఆమె కూలి పని చేసుకొని ఇద్దరు బిడ్డలను పోషించేది. మరో మూడు రోజుల్లో రంజాన్ పండుగ వస్తోంది. పేదరికం కారణంగా చేతిలో డబ్బు లేకపోవడంతో పండుగ సరుకులతో పాటు పిల్లలకు కొత్త దుస్తులు కూడా తీసుకోని దుస్థితి ఆమెది. విషయం తెలుసుకున్న సీఐ కొత్త బట్టలతో పాటు బియ్యం ప్యాకెట్, నిత్యావసర సరుకులను షబానాకు అందచేశారు. మానవత్వంతో స్పందించిన సీఐకి ఆమె కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో సిబ్బంది బాబాఫకృద్దీన్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు, సిబ్బంది

ప్రొద్దుటూరు : రైతులందరూ ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో పంటలను సాగు చేయాలని అడిషనల్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వసంతకుమారి పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయంపై ప్రొద్దుటూరు మండలంలోని తాళ్లమాపురం గ్రామంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మాట్లాడుతూ ఏడాదిపాటు ఏయే పంటలు సాగు చేసుకోవచ్చో వివరించారు. నవధాన్యాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని తెలిపారు. సమావేశంలో రైతులు మల్లికార్జునరెడ్డి, భూషణ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, బాలసూరారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్యాంసుందర్, రాజు, బయపురెడ్డి, సావిత్రి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం సంతోషం


కమ్మవారిపల్లెలో ప్రజలకు సంక్షేమ పథకాలపై వివరిస్తున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

బ్రహ్మంగారిమఠం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా రూ.లక్షలలో లబ్ధి చేకూరడంతో ప్రతి కుటుంబం సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని దిరసవంచ పంచాయతీలో రెండవ రోజు కమ్మవారిపల్లె, దిరసవంచ, ఎస్సీకాలనీ, చౌటపల్లె గ్రామాల్లో గడప గడపకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల ద్వారా ఆనందంగా ఉన్నట్లు ప్రతి కుటుంబం వారు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికీ ముఖ్యమంత్రిగా ఉండాలని, మా ఓట్లు ఆయనకే వేస్తామన్నారు. మొదటగా కమ్మవారిపల్లెలో పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు సీసీ రోడ్లు ఉన్నాయని, డ్రైనేజీ, కరెంట్ సమస్యలు తీర్చాలన్నారు. దిరసవంచ ఎస్సీకాలనీలో తాగునీరు సమస్యను పరిష్కరించాలన్నారు. దిరసవంచ గ్రామస్తులు రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి, సర్పంచ్ అమీర్‌బాషా, ఎంపీటీసీ సభ్యురాలు నాగిపోగు గంగమ్మ, సింగిల్‌విండో అధ్యక్షుడు నేలటూరు సుబ్బారెడ్డి, ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, మైదుకూరు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ భర్త రవి, కమిటీ సభ్యురాలు భర్త మణ్యం శంకర్‌రెడ్డి, పంచాయతీ వైఎస్సార్‌సీపీ నాయకులు బిజివేముల మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సుబ్బారెడ్డి, బి.సుబ్బారెడ్డి, రమణారెడ్డి, నారాయణరెడ్డి, మండల స్థాయి అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రూ.1.5 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

మైదుకూరు : మైదుకూరు నియోజకవర్గంలో రూ.1.5 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపినట్లు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి నిధులతో చేపట్టే ఈ పనుల గురించి మైదుకూరులో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో సీసీ రోడ్లు, శ్మశానాలకు ప్రహరీలు, అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణం, ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో ఆర్‌ఓ ప్లాంట్లు, పైపులైన్లు, నీటి పథకాలకు మోటార్లు ఏర్పాటు తదితర పనులను చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. సమావేశంలో మైదుకూరు వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, చాపాడు ఎంపీపీ టి.లక్షుమయ్య, ఏపీఐఐసీ డైరెక్టర్ డి.గంగాదర్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఈఈ రామచంద్రారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మహేశ్వర, అన్ని మండలాల ఏఈలు పాల్గొన్నారు.

సమష్టి జీవనానికి ప్రతీక ఇఫ్తార్


ఇఫ్తార్ విందులో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

బద్వేలు : అందరూ కలిసిమెలిసి సమష్టిగా జీవించేందుకు ఇఫ్తార్ విందు తోడ్పడుతుందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తెలిపారు. బుధవారం పోరుమామిళ్ల పట్టణ పరిధి కోటవీధిలోని మసీద్‌లో జరిగిన విందులో ఆయన పాల్గొన్నారు. కలిసిమెలిసి పండుగ చేసుకోవడంతో పాటు అండగా నిలుస్తుండటం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ కల్లూరు రమణారెడ్డి, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, పార్టీ మండల కన్వీనర్ సీ బాషా, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ చెన్ను రాజశేకర్, కో ఆప్షన్ సభ్యులు అల్లా, నాయకులు డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, రాళ్లపల్లి రవి, రాళ్లపల్లి నరసింహులు, హబీబ్, చాపాటి నారాయణరెడ్డి, రాజీవ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు


ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : రంజాన్ పండుగను పురస్కరించుకుని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ముస్లింలకు బుధవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పట్టణంలో ఉన్న అన్ని మసీదుల్లో ఉపవాసాలున్న వారి కోసం ఎమ్మెల్యే ఇఫ్తార్ విందును ఇచ్చారు. సాయంత్రం స్థానిక కడప రోడ్డులోని షాహీ మసీదు (పెద్దమసీదు)లో ముస్లింలతో కలసి ఎమ్మెల్యే ప్రార్థనలు చేశారు. అనంతరం ఉపవాసాలున్న వారికి భోజనం వడ్డించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, వైస్ ఎంపీపీ రఘురామిరెడ్డి, మైనారిటీ నాయకులు, మున్సిపల్ వైస్ చైర్మన్ షరీఫ్, షౌకత్ అలీ, మహ్మద్, అక్బర్, కందనూరు షరీఫ్, ఖాదర్, అనియిన్ గౌస్, నాయబ్, గోబి బాషా తదితరులు పాల్గొన్నారు.

దువ్వూరు : మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు కఠోరమైన ఉపవాస దీక్షలు చేస్తారని తెలిపారు. అల్లా చూపిన మార్గంలో నడవాలని, ఇతరుల పట్ల సోదర భావాన్ని కలిగి, దానధర్మాలు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రతాప్‌రెడ్డి, ఖాదర్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు కోగటం వీరారెడ్డి, ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, జెడ్పీటీసీ కోఆప్షన్ మెంబర్ ఖాదర్‌బాషా, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హజరత్ యదుల్లామాలిక్ గంధోత్సవం

కడప కల్చరల్ : నగరంలోని ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక క్షేత్రమైన అమీన్‌పీర్ దర్గాలో బుధవారం హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా యదుల్లా మాలిక్ మహమ్మద్ మహమ్మదుల్ హుసేనీ చిష్తివుల్ ఖాద్రీ ఉరుసు ప్రారంభమైంది. ఉత్సవాలలో తొలిరోజున గంధం సమర్పణ నిర్వహించారు. దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ గంధం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.